1

Reg. No. 757

# అభినవసరస్వతి

యను నొక మాసపత్రిక.

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు
జనపాటి పట్టాభిరామశాస్త్రిచే
ప్రచురింపఁబడుచున్నది.

జా న పా డు.


సంపుటము 19 { 1927 సం॥ నవంబరు నెల. } సంచిక 8


విషయములు.



చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు రు 25 0 0 సహాయులకు రు 5 0 0

పోషకులకు రు 10 0 0 చందాదారులకు 3 0 0


Printed at the Chandrika Press, Guntur,
and published at Janapadu by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc.



OFFICE ... JAN ... MADRAS

## ప్రధానపోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు విరూపాక్ష స్వాములవారు, చితాపూరు.
౨ శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి స్వాములవారు, జనగాం.
౩ బాకరాజు పరాంకుశరావుదేశాయిగారు. యాదవరం.
౪ రామసింగుగారు- నెల్లుట్లసాపురసంస్థానముల మేనేజరు- నెల్లుట్ల.
౫ శ్రీమద్వెంకట శేషారెడ్డి రామచంద్రారెడ్డి దేశముఖుగార్లు, ఆల్లాదుర్గసంస్థానము.

## పోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు అభినవ విరూపాక్ష పీఠాధిపతులు, విశాఖపట్టణంజిల్లా.
౨ ఎనమండ్ర లక్ష్మీనరసింహముగారు, మర్చెంటు, బెజవాడ.
౩ రాజా వెంకటాద్ర్యప్పారావు, బహదరుగారు, వుయ్యూరుయెస్టేటు.
౪ రాజామంత్రిప్రగడ వెంకటహనుమంతరావు, రాఘవరావుగార్లు, లింగగిరి.
౫ తంగెడ నరసింహారావుగారు, కరణం, మొగ్గంపాడు.
౬ శ్రీరామయాంబికా పుస్తకభాండాగారము, లక్ష్మీనర్సాపురము.
౭ లింగాల వెంకటరెడ్డి దేశముఖుగారు, కుందవరము
౮ చారబుడ్డి రత్నారెడ్డిపటేలుగారు, న్యాలపోగుల
౯ టి. లక్ష్మణసింగుగారు, జొనగాం
౧౦ నెల్లుట్ల నరసింహారావుగారు, జొనగాం
౧౧ రంగాచార్యులుగారు, ముక్త్యారు, దేశముఖు, మసీదుపల్లె.
౧౨ ఓకులపల్లి కృష్ణారెడ్డిగారు, కేశవాపురము.
౧౩ జాగర్లమూడి కుప్పుస్వామినాయఁడుగారు, కారంచేడు
౧౪ పిశుపాటి వెంకటరాయశర్మగారు, కరవది
౧౫ శ్యామాపంతుల వెంకటేశ్వరరావుగారు, తహశీల్దారు, ఇంగోలి.
౧౬ గూడూరి వీరసాంబశివరావు సర్దేశపాండ్యాగారు, మానుకోండూరు
౧౭ కొత్వాలి వెంకటేశ్వరరావుగారు, సంగెం
౧౮ లింగాల రంగారెడ్డి దేశముఖు, గణపురం,

---

## సహాయులు

౧ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౨ బుడంపాటి సుబ్బయ్యగారు, మర్చంట్, కాకినాడ
౩ సంగెం రామారావుగారు, కుంటపల్లి.
౪ పెద్దిభట్ల వీరయ్యగారు, ప్లీడరు బెజవాడ
౫ నెల్లుట్ల కేశవరావు దేశముఖుగారు, నెల్లుట్ల
౬ రంగావఝ్ఝల రంగయ్యగారు, నర్సారావుపేట
౭ నారాయణరావుగారు, దాతారుపల్లె

# అభినవసరస్వతి

సంపుటము ౧౫ { జానపాడు ప్రభవ సం॥ కార్తికమాసము } సంచిక ౮

## వర్ణాశ్రమధర్మములు పోషింపవలసినపద్ధతి.

వర్ణాశ్రమధర్మములు నశించినవా? గ్రంథములం దుండుట లేదా? వానిని రక్షించుట అనిన ఎట్లు? అని కొందఱు బుద్ధిమంతు లడుగవచ్చును. బ్రాహ్మణులీయుగమున హిందూదేశమున వర్ణాశ్రమ ధర్మముల ననుసరించి నడచుచు వచ్చుచున్నందున నవి యింకను నశింపలేదు. నశించు నని చెప్పుట కనేక లక్షణము లగుపడుచున్నవి; రూపఱలేదు. ఆంగ్లేయభాషాభ్యాసమువలన బ్రాహ్మణులకుఁ దృష్ణ హెచ్చినది; సేవకావృత్తియం దభిరుచి కలిగినది. పూర్వము స్వతంత్రులై యున్నవారు, పరతంత్రులై వైరాగ్యసంపద కోల్పోయిరి. దానం జేసి కులధర్మము లనుష్ఠించుట కొందఱువిడిచిరి; కొందఱు విడుచుచున్నారు; వెండియుఁ గొందఱు వానిని విడువక యాచరించుచున్నవారు. ప్రాచీనకాలమున వైరాగ్యసంపదకల మహర్షులు అలముకర్కంటినైనను, లక్ష్య మొనర్పక స్వకులధర్మము లనుష్ఠింపుచు ననేక శాసనము లొనర్చి వానినెల్ల మీఱిపోకుండవలయు నని శాసించిరి. అట్టిమహానీయులు శాసించిన శాసనముల నేఁటివరకు సంఘసంస్కారకులు భగీరథప్రయత్నము లెన్నిసలిపినను, వారు వాని నుల్లంఘింప నేరకున్నవారు. ఏల? ఆశాసనములు కల్పించిన మహానీయులు తృష్ణాదూరులు; స్వార్థత్యాగులు; అఘటనఘటనాసమర్థులు; వైరాగ్యమే సంపదగాఁ గల మహాతపోబలసంపన్నులు. అప్పటిరాజులఁ గొలిచి సేవఁజేసి బ్రతుకఁగోరిన నేఁటినవనాగరకులవంటివారు కారు. ట్టి మహాపురుషులు శాసించినచట్టము లతిక్రమింపఁ గోరిన నేఁటినవ

నాగరకు లెట్టిమహానీయులు ? తృష్ణాఢ్యులు; స్వార్థపరులు; వైరాగ్య మనుపదము వారికిఁ దెలియదు. నేఁటిదొరలఁ గొలిచికొని బ్రతుక నేర్వని పరతంత్రులు. ఇట్టిపరాధీనులు సర్వతంత్ర స్వతంత్రులును, పరాధీన మెట్టిదో యెఱుఁగని మహాపురుషులును, అయిన ఋషిపుంగవులు గావించిన చట్టము లెత్తెఱంగున నుల్లంఘింపఁగలరు ? కావుననే ఆ మహర్షులు మన కేర్పరచిన మార్గమునఁ బోవ నుపేక్షించి పరతంత్రులమై మహానీచస్థితికి వచ్చినా మని మిక్కిలి పరితపించి కాఁబోలు, అమృతబజారుపత్రికాధిపతి యగు మోతిలాలుగోసుగారు, తూర్పువంగ రాష్ట్రసభ కగ్రాసనాధిపతియై తాఁ జేసిన యుపన్యాసములో "పశ్చిమ ఖండ వాస్తవ్యులసహవాసనాబలముంజేసి మనము మిక్కిలి హీనస్థితికి వచ్చినారము. దానిం దొలఁగించి యున్నతస్థితికి రాఁ గోరుదుమేని 'Let us go back to the mode of life of our ancient rishis' ప్రాచీనకాలమున నుండినఋషులు జీవించిన త్రోవఁబోయి మన మట్లే జీవింపఁ బ్రారంభింతము" అని వ్రాసిచ్చినారు. ఇట్టియభిప్రాయ మింగ్లీషు చదివి లోకమే స్వకుటుంబముగాఁ దలఁచి దేశాభివృద్ధికై పాటుపడుచుండు మహానీయులు సైతము నొక్కివక్కాణించి యున్నారు. ఇఁక నేఁటికాలమున బ్రాహ్మణులు స్వకులధర్మము నాచరింపుచుఁ దమకుమారులచే నాచరింపింపుచు నుండఁ బూనుదురేని ఋషులు పోయినదారిఁ బోయినవా రయ్యెదరు. కాకపో రని మానమ్మకము.

## పురాణములు

సంస్కృత వాఙ్మయముయొక్క ప్రాచీనతయు పెక్కు విషయములలో దాని యాధిక్యతయు హైందవ, పాశ్చాత్య పండితులచేత నిర్వివాదాంశముగ స్థిరపర్చఁబడినది. తమజన్మలనంతయు ధారపోసి,

ప్రాపంచిక భాషలలో సంస్కృతభాషయొక్క యుత్కృష్ట పదవిని కను గొనుటయేగాక దానిని ప్రపంచమునకు వెల్లడించి కీర్తిగాంచిన విల్సను, కోల్ బ్రూకు, మ్యాక్సుముల్లరు, విన్సెంటుస్మిత్తు, రమేశచంద్రదత్తు, రామకృష్ణగోపాలభండార్కరు మున్నగు మహానుభావులు హైందవు లను కృతజ్ఞతాసముద్రమున ముంచివైచిరి. మానవజ్ఞానముయొక్క అన్నిశాఖలను సంస్కృతవాఙ్మయమున పరిపూర్ణపదవిని గాంచెను. హెర్బర్టుస్పెన్సరు, క్యాంటు మున్నగు ఆధునిక పండితోత్తములచే నూతనముగ స్థాపింపఁబడిన సిద్ధాంతము లన్నియును అనేకవందల సంవత్సరముల క్రిందటనే, ఆర్యావర్తమునకు వన్నెదెచ్చి కపిల, గౌతమ, శంకరాది మహానీయులచే సమగ్రముగ చర్చింపఁబడెను. చరకము, సుశ్రుతము మొదలగు ఆయుర్వేదగ్రంథములను పరిశీలించిన యెడల వైద్యశాస్త్రమును మన పూర్వు లెంతఉన్నతస్థితికి తీసికొనివచ్చినది స్పష్టమగును. అన్ని శిల్పములును అన్ని కళలును సాంగోపాంగముగ శాస్త్రయుక్తముగ వ్రాయబడియున్నవి. పాణిని మహర్షిచే శాస్త్ర యుక్తముగ వ్రాయఁబడిన వ్యాకరణముకూడ సంపూర్ణతను పరిపక్వ తను పొందినది. ప్రాచీనాధునికభాషలలో ఏభాషయందును ఇట్టివ్యాక రణశాస్త్రము లేదు. చరిత్రరచనయందు మాత్రము మన పూర్వులకు కౌశలముగాని అభిరుచిగాని లేదని పాశ్చాత్యపండితుల యభిప్రాయ మై యున్నది; కాని, ఇది సరికాదు. కాశ్మీరరాజుల చరిత్రాత్మకమైన రాజతరంగిణియును, సూర్యవంశపురాజుల ప్రభయును, అప్పటి దేశ విశేషములను విపులముగా వర్ణించు రఘువంశాది కావ్యములును, వాస్తవముగా చరిత్రములె. కాని, హిందూదేశచరిత్రకారులు హైంద వమహాయుగమును వ్రాయునపుడు మన గ్రంథరాజముల సాహాయ్య మును బొందఁజాలకపోవుట చరిత్రకారుల లోపముగాని సంస్కృత వాఙ్మయమునందు చరిత్రరచనకు వలయు సామగ్రిలేని లోపము గాఁ

జాలదు. హోమరు, వర్జిలు మున్నగు మహాకవుల గ్రంథములచే గ్రీసు రోమక చరిత్రములు దనరారుచుండ మన పురాణేతిహాసముల సహాయమును లేశమాత్రమును పొందకపోవుటచే హిందూదేశచరిత్రము పెంపును పొందలేనిదయ్యె. హిందూదేశచరిత్ర రచనయందు నవీనపథమును ద్రొక్కి సంస్కృతవాఙ్మయ సహాయముతో హిందూ మహాయుగ చారిత్రమును చక్కఁగ వ్రాసిన రమేశచంద్రదత్తు, విన్సెంటుస్మిత్తుగార్లు చరిత్రకారులకు మార్గదర్శకులై యున్నారు.

సంస్కృతవాఙ్మయమున పురాణములు లోక మహాశాఖలై యున్నవి అవి హిందూదేశ చరిత్ర నిర్మాణమునకు ప్రాణాధారములు. పురాణవాఙ్మయమును పరిశోధించి హిందూజాతీయసభ్యతలో వాని యుత్కృష్ట పదవిని చాటిన విల్సను, కర్నలు, కెన్నెడి యను వారలు మిక్కిలి ప్రశంసనీయులు. పురాణ విమర్శనమున ఈక్రింది యంశములు ప్రధానములుగ తలఁచితిని. పురాణము లన్నియును,

“ సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ
వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణమ్ ”

అను అమరసింహుని నిర్వచనము ననుసరించియే యున్నవా ? లేక కర్నలు కెన్నెడిగారు అభిప్రాయపడినటుల పురాణములు కేవలము మతబోధకమాత్రమే సాధనములా ? వీరి యభిప్రాయమునకు ఆధారము లేకపోలేదు. బ్రహ్మపురాణములోని యుత్తరఖండమంతయు బలజానదీమాహాత్మ్యమును వెల్లడిచేయుచున్నది. శ్రీమహాభాగవతము యొక్క షష్ఠస్కంధము విష్ణుభక్తితో నుప్పొంగుచున్నయది. మఱియు సంస్కృతవాఙ్మయమందు పురాణస్థానమెద్ది? చరిత్రనిర్మాణమునకు ఇయ్యవి యెంతవరకు సహకారిగా నుండును? వీటి విషయనిర్మాణము, కావ్యనిబంధన, కవితారచన యెట్టిది ? పురాణముల కాలనిర్ణయ మెటుల కనుంగొనఁదగు ? పౌరాణికమతమునకు, ఉపనిషత్తులలో

నుద్ఘోషింపఁబడు వైదికమతమునకు సంబంధ మెట్టిది? కొన్నిపురాణము లమరసింహుని పురాణనిర్వచనము ననుసరించి యుండని హేతువుచే ప్రాచీనపురాణము లన్నియు మనకు సక్రమముగా లభ్యమైనవా యను సందేహముకూడ పొడగట్టుచున్నది. ఈకారణముచేతనె విల్సను పండితుఁడు పురాణముల కాలము క్రీ. శ. ౧౨ వ శతాబ్దప్రాంతమని నిర్ణయించెను. కాని, ఇది సరికాదనియును వానికాలము క్రీ పూ. 3 వ శతాబ్దము తరువాతను క్రీ శ. ఏడవ శతాబ్దమునకు పూర్వమును అని, విన్సెంటుస్మిత్తు పండితోత్తముఁడు ఆయన సుప్రసిద్ధమైన హిందూమహాయుగ గ్రంథమున ఈ విషయముగ సమర్థించినాఁడు:—

“క్రీ. శ. ౧౧ వ శతాబ్దమునను పదునెనిమిది పురాణములు సుప్రసిద్ధమైన వాఙ్మయములో నుండి యున్నవని “అల్బెరూని” అను చరిత్రకారుఁడు వ్రాయుచున్నాఁడు. క్రీ. శ. ఏడవశతాబ్దమున జీవించియున్న బాణమహాకవి తన హర్షచరిత్రమున మార్కండేయాగ్ని వాయుభాగవత పురాణములఁ గూర్చి నుడివియున్నాఁడు. అచిరకాలము క్రింద లభ్యమైన గుప్తాక్షరలిపిలో నున్న స్కందపురాణ లిఖితపత్రమునుబట్టి స్కందపురాణము క్రీ. శ. ఏడవశతాబ్దమునకు పూర్వపుదని ధ్రువపడినది. వాయు, మత్స్య, బ్రహ్మాండ, విష్ణుపురాణముల భవిష్యద్రాజులవర్ణన గుప్తచక్రవర్తులతోడను వారి సమకాలికులతోడను ఆపివేయఁబడినది. క్రీ. శ. 3 వ శతాబ్దమున వ్రాయఁబడిన ‘మిళిందుని ప్రశ్న’లను బౌద్ధగ్రంథము పురాణములను గురించి ముచ్చటించినది.”

ప్రతి పురాణము ౧౮ పురాణములను గుఱించియు ౧౮ ఉపపురాణములను గుఱించియు వ్రాయుచున్నది. మత్స్య, పద్మపురాణములు పురాణముల నన్నిటిని తామస, రాజస, సాత్వికము లని మూఁడువర్గములుగ భాగించియున్నవి. మఱొక పురాణవిభాగమునకు

భక్తిప్రధానము. సాత్త్విక పురాణములు విష్ణుదేవుని యాధిక్యతను చాటుచున్నవి. తామసవర్గము శివాగ్నుల మాహాత్మ్యములతో నిండి యున్నది. రాజసవర్గమునకు బ్రహ్మయే ప్రధానము. కలిపురాణము లోని దుర్గామాహాత్మ్యమునుబట్టియు, బ్రహ్మవైవర్తములోని రాధాస్తోత్రమునుబట్టియు రాజసపురాణములు శాక్తేయములని కూడ కొందఱూహించుచున్నారు. పురాణశ్లోకముల సంఖ్య ౪,౦౦,౦౦౦. స్కందపురాణము ౮౧,౦౦౦ శ్లోకములతో పురాణరాజ మనిపించుకొనుచున్నది. పేరునకుఁ దగినటుల వామన పురాణమును బ్రహ్మపురాణమును ౭,౦౦౦ శ్లోకములను మాత్రమె కలిగి అన్నిటికంటెను చిన్నవై యున్నవి. వాయుపురాణము మిక్కిలి ప్రాచీనమైనదిగా పరిగణింపఁబడుచున్నది. ప్రతి పురాణము ఇద్దరు ఋషిపుంగవుల సంభాషణతో నుపక్రమింపఁబడును. గ్రంథము విస్తరించుకొలఁదిని యింక ననేకములైన యుపసంభాషణలతోడను చిత్రకథలతోడను అల్లుకొని యుండును. ఒక్కొక్కతఱి పూర్వజన్మపరిజ్ఞానముగల పశువులకును మానవులకును సంవాదముగా ఈ సంభాషణలు పరిణమించును. ఈ పౌరాణిక సంభాషణలలో ప్రధానపాత్ర రోమహర్షుఁడనియును సూతుఁడనియును నామాంతరములుగల లోమహర్షుఁడై యున్నాఁడు. ఈయన వ్యాసులవారి ప్రధానశిష్యుఁడు. "వ్యాసుడు" "సూతుఁ"డను నవి సామాన్యనామము లనియును- రాజకీయ మతవిషయముల చర్చించుచు, రాజుల శౌర్యప్రతాపముల వర్ణించుచు, సృష్టి, ప్రళయ వైచిత్ర్యముల నుద్ఘోషించుచు రాజసభలలోనుండు స్తోత్రపాఠకుల కందరికిని యీ నామ మన్వయించు ననియును- వేదములకును పురాణములకును సంపాదకుఁడుగానున్న "వ్యాసుఁడు" శ్రీకృష్ణద్వైపాయనుఁడనియును కొందఱు పండితు లూహించుచున్నారు. విషయము ప్రతి పురాణమునకు సామాన్యమే యని చెప్పనగు. సృష్టి ప్రళయవైచిత్ర్య

ములు, దేవతామాహాత్మ్యములు. భూగోళ, ఖగోళ. భౌతికశాస్త్రములు అతిధారాళముగ చర్చింపఁబడును. అక్కడక్కడ స్థలమాహాత్మ్యములు, ఉపవాస వ్రతముల విశేషములును శ్రావ్యముగ బోధింపఁబడును. విష్ణుపురాణ మన్నిటికంటెను అమరసింహుని పాంచలక్షణిక పురాణమును మిక్కిలి పోలియుండును. పైనుదహరించిన యంశములు గాక ఈ విష్ణుపురాణమందు వర్ణాశ్రమధర్మములును నీతిపద్ధతియు విపులముగా వ్రాయఁబడినది. కావుననే ఇది విష్ణుసంహిత యనికూడ ప్రసిద్ధిగాంచినది. ఇక్కారణముచేతనె ఈ విష్ణుపురాణము సంహిత, వైదిక సంహితల కనుగుణ్యముగా నుండునట్టియు, లోమహర్షుఁడును ఆయన శిష్యత్రయమగు మైత్రేయుఁడు, శంసాపాయనుఁడు, అకీర్తవ్రణుఁడు రచియించి నట్టియు, పౌరాణికసంహితల సంగ్రహమేయని విల్సను పండితుఁ డభిప్రాయపడియున్నాఁడు.

పౌరాణిక మతమునకును వైదికమతమునకును మిక్కిలి వ్యత్యాసము కలదు. వేదములలో బ్రహ్మ విష్ణు శివవరుణేంద్రులు సామాన్య దేవతలుగ పరిగణింపఁబడిరి. అఖండమైన ఉత్కృష్టమైన ఏకేశ్వరోపాసన ఆర్యావర్తమున నెలకొల్పఁబడినది. గంగా సింధు యమునా నదీతీరములయందు బ్రహ్మావర్తమంతయు వైదిక మహామునుల "ఏకంసత్విప్రాబహుధావదంతి "యను సూక్తులచే ప్రతిధ్వనించుచుండెను. పౌరాణిక కాలమునాఁటి కిదంతయు మారెను. బ్రహ్మ విష్ణు మహేశ్వరులుత్కృష్టదైవములై త్రిమూర్తులుగా వెలసిరి. వారితో 33 కోట్ల దేవతలును ప్రసన్నులైరి. జ్ఞానులసంఖ్య తగ్గెను. పామరులసంఖ్య హెచ్చుపోగెను పామరుల జ్ఞానాభివృద్ధి సాధనము లాలోచింపబడవలసి వచ్చెను. కొన్ని స్థలములు దివ్యస్థలములాయెను. పామరుల భక్తిప్రపత్తుల వృద్ధికొఱకు దేవాలయములు నిర్మింపఁబడెను ప్రతిమారాధన ప్రతిష్ఠింపఁబడెను. ఈ మార్పులన్నియును, హైందవమత భావ

మున నొక విప్లవమును గలిగించి ఆసేతు శీత నగమధ్యస్థితంబైన ఆర్యావర్తమునందేయు తాండవమాడించిన ద్వైతాద్వైత విశిష్టాద్వైతమత సిద్ధాంతముల యుత్పత్తిని సూచించెను.

ఇంక పురాణముల కావ్యనిబంధనను గుఱించి యొక్కమాట. వేదముల యనుష్టుప్ వృత్తము పౌరాణికశ్లోకముగ పరిణమించెను. కావ్యాలంకారశాస్త్రములు కడువృద్ధిం గాంచెను. పాణిని వ్యాకరణ సూత్రములచే భాషను, భావమును బంధించెను. కావ్యరచన కట్టుదిట్టముతో నిండెను. భాషాస్వాతంత్ర్యము సన్నగిలెను. రసవంతమై జవముగల వైదికసులభశైలి దీర్ఘసమాసభూయిష్ఠంబై దుర్గ్రాహ్యంబైన శైలిగా మాఱెను. ఇట్టి పౌరాణికశైలియందు సహితము ప్రశంసనీయములైన విశేషములు లేకపోలేదు. “ వ్యాకరణసూత్రములచే గాఢముగా బంధింపఁబడి దీర్ఘసమాసములచే నిండి విపరీత భావగర్భితమైన యీ కావ్యశైలి, నానావృక్షములచే నిబిడీకృతమైన వింధ్యాటవింబోలె మనోహరములై యొప్పారు కవితా గుచ్ఛముల నిచ్చును ” అని మాక్డొనెలు పండితుఁడు తన సంస్కృతవాఙ్మయము గ్రంథమున వ్రాయుచున్నాఁడు.

సంస్కృతవాఙ్మయమహావృక్షమునకు పురాణములు మహోన్నతములైన శాఖలై వెలయుచున్నవి. అవి ఆసేతుహిమాచల పర్యంతము హిందూదేశమును దట్టముగ నావరించినవి. వాటి చాయ క్రిందనే హైందవ జాతీయభావము వృద్ధిని గాంచినది. ఏ హిందూ గృహము రామాయణ భారత భాగవత గ్రంథకాలక్షేపముచే అనుదినమును పావనమగుచుండుట లేదు? ఏ హిందూ స్త్రీయొక్క హృదయము రుక్మిణీదేవియొక్క సచ్చారిత్రముచే రంజింపఁబడదు? ఏ హైందవ భక్తుఁడు గజేంద్రుని విష్ణుస్తవముతోడను ప్రహ్లాదుని భక్తిగీతములతోడను నాట్యమాడఁడు? కుచేలుని పవిత్రచారిత్ర మెన్ని బీదగృహ

ములను తేజోవంతములు చేయుటలేదు? ఉత్కృష్టములై మహోన్నతములైన ఆదర్శములను ప్రీతిపొందవుని జ్ఞానపథమునసుంచి భక్తిసముద్రమున ముంచివైచి ఎల్లప్పుడును సన్మార్గమునే సూచించుచు ఆర్యావర్తమునకు కర్మభూమియను నామమును సార్థకముచేసినది శ్రీభాగవతాది పురాణములే. ఇట్టి వాఙ్మయపరిచయమును చేసికొని జాతీయాదర్శములను బలపఱచుటకు ప్రతిదేశాభిమానియు సహకారిగావలెను.

## ఇట్లు నడుచుకొనుము.

చరకసంహితయొక్క సూత్రస్థానమునందలి ఇంద్రియోపక్రమణీయ మను ఎనిమిదవ అధ్యాయమున మనుజుని ప్రవర్తనము ఈక్రింది విధముగ శాసింపఁబడినది. అట్లు నడచుకొనిన మనుజునకు ఇహపరములు నిష్కంటకము లగును. మన శాస్త్రములన్నియు ఐహికప్రయోజనములతో బాటు పారలౌకికప్రయోజనములకుఁగూడ ఉత్పాదకములై యున్నవి. ఇదియే భారత జాతీయసాంప్రదాయముయొక్క ఔత్కృష్ట్యము. పాశ్చాత్యుల శాస్త్రవిచారము ఇహమును దాటి వెళ్ళదు. ఆకారణమువలననే వారు మన శాస్త్రములను అర్థము చేసికొనఁజాలరు. దేశమున ఆంగ్లభాష ప్రబలుటతో దేశభాషలు నిరాదరింపఁబడఁగా ఇప్పుడు నాగరికుల మనుకొను మనవారుకూడ అట్టి స్థితియందే యున్నారు.

"అగ్నివేశుఁడా, దేని ననుష్ఠించుటవలన మానవుఁడు ఆరోగ్యమును, ఇంద్రియవిజయము బడయునో ఆ సద్వృత్తమును నీకు పూర్ణముగా నుపదేశించెదను. దేవతలను, గోవులను, బ్రాహ్మణులను, గురు

పులను, వృద్ధులను, సిద్ధులను, ఆచార్యులను పూజింపవలెను. అగ్నిని ఉపచరింపవలయును. (అనగా అగ్నియందు హోమములు చేయవలయును) ప్రశస్తములగు ఓషధులను ధరింపవలెను. ప్రాతఃకాలమునందును, సాయంకాలమునందును స్నానముచేయవలయును. మలమార్గములందును, పాదములందును తప్పక పారిశుధ్యమును కాపాడుచుండవలెను. పక్షమునకు మూడుమారులు కేశములు, మీసములు, గడ్డము, దేహముమీది వెంట్రుకలు, గోళ్ళు వీనిని తీయించివేయవలయును. (అనగా క్షౌరము చేయించుకొనవలయును) ఎప్పటికప్పుడు నిర్మలవస్త్రములను ధరించుచుండవలెను. మనస్సును నిర్మలముగా నుంచుకొనవలెను. సుగంధద్రవ్యములను అలదుకొనవలెను. చక్కని వేషముతో నుండవలెను. శిరోజములను సుగంధతైలాదులచే సంస్కరించుకొనుచుండవలెను. శిరస్సు, చెవులు, ముక్కులు, పాదములు— వీనికి నిత్యమును తైలము పట్టించుకొనుచుండవలెను. తాను ముందు పలుకరించుచుండవలెను. సుముఖుఁడుగను, ఆపన్నులను రక్షించువాఁడుగను ఉండవలెను. హోమము చేయవలెను. యజ్ఞములను చేయవలయును. దానములు చేయవలెను. నాలుగుత్రోవలు కలిసిన చోట నమస్కరింపవలెను. బలిదానము చేయవలెను. అతిథులను పూజింపవలెను. (మృతిచెందిన) తల్లిదండ్రులకు పిండదానము చేయవలెను. సమయ మెఱిఁగి హితముగను, మితముగను, మధురముగను, అర్థయుక్తముగను మాట్లాడవలెను. ఇంద్రియములను స్వాధీనమున నుంచుకొనవలెను. ధర్మాత్ముఁడుగా నుండవలెను, హేతువులయందు శ్రద్ధగలిగి యుండవలెను. ఫలము నెడల ఇతరుల సంపదను జూచి అసూయపడఁగూడదు. నిశ్చయజ్ఞానముతో నుండవలెను. నిర్భీతుఁడును, ధీమంతుఁడును, లజ్జావంతుఁడును, మహోత్సాహియు, ధీరుఁడును, క్షమావంతుఁడును, ధార్మికుఁడును, ఆస్తికుఁడును, వినయము, బుద్ధి,

విద్య, వంశము, వయస్సు — వీనియందు అధికులై యుండువారిని పూజింపవలెను. గొడుగును, చేతికఱ్ఱను, పాగాను, కాలిజోడును ధరింపవలెను. నడుచునపుడు ముందు నాలుగైదు మూరలు చూచుచుండవలెను. మంగళకరములగు ఆచారములు, స్వభావముగలవాఁడై యుండవలెను. చినిగిన బట్టలు కట్టఁగూడదు. ఎముకలు, కపాలములు, కేశములు, ముండ్లు, బూడిద మున్నగు వానిని ధరింపఁగూడదు. స్మశానాదులలో చరింపఁగూడదు. ఆయాసము రాకమునుపే కసరత్తు మానవలెను. సకలప్రాణులయెడలను బంధుబుద్ధి చూపవలెను. కోపముతో నున్నవానిని శాంతింపఁజేయువాఁడుగను, భయమందినవారిని ఆశ్వాసించువాఁడుగను, దీనులయెడల దయగలవాఁడుగను ఉండవలెను. సత్యసంధుఁడుగను, సామమే ప్రధానమైనవాఁడుగను, పరులు పరుషములు పలికినపుడు సహించువాఁడుగను, కోపము లేనివాఁడుగను, శాంతుఁడుగను, రాగద్వేషములు లేనివాఁడుగను ఉండవలెను."

"అబద్ధము చెప్పఁగూడదు. ఇతరుల ద్రవ్యమును హరింపఁగూడదు. పరస్త్రీలను పరద్రవ్యమును కోరఁగూడదు. ఎవరితోడను విరోధపడఁగూడదు. పాపము చేయఁగూడదు. పాపము నెడల శ్రద్ధయుంచకూడదు. ఇతరుల లోటులను చెప్పఁగూడదు. ఇతరుల రహస్యములను తెలిసికొనఁగూడదు. అధార్మికులతోడను, రాజద్వేషులతోడను, పతితులతోడను, భ్రూణహంతలతోడను, క్షుద్రులతోడను, దుష్టులతోడనుగూడ కలియఁగూడదు. దుష్టయానముల నెక్కఁగూడదు. మోకాటియెత్తుగల కఠినాసనములమీద కూర్చుండరాదు. ప్రక్క లేనిదియు, దిండ్లు లేనిదియు, విశాలము గానిదియు, మిట్టపల్లములు గల్గినదియు నగు శయ్యపైఁ బరుండఁగూడదు, విషమములగు గిరిశిఖరములయందు సంచరించఁగూడదు. చెట్లు నెక్కఁగూడదు. మిగుల వడిగా పాఱుచుండు నీటిలో స్నానము చేయఁగూడదు. క్రీనీడ

యందు నిలువఁగూడదు. మంటచెంతకుఁ బోఁగూడదు. బిగ్గరగా నవ్వఁగూడదు. చప్పుడగునట్లు అపానవాయువును విడువఁగూడదు. నోటిని మూసికొనకుండ దగ్గఁగూడదు. తుమ్మఁగూడదు. ఆవులింపఁగూడదు. నవ్వఁగూడదు. ముక్కు గోకికొనఁగూడదు. పండ్లు కొఱుకఁగూడదు. గోళ్ళతో వాయింపఁగూడదు. ఎముకలను ఎముకలతోఁగూడ కొట్టఁగూడదు. నేలను వ్రాయఁగూడదు. గడ్డిపరకను త్రుంపఁగూడదు. మట్టిని నలువఁగూడదు. వికారముగా కరచరణాదులను కదలింపఁగూడదు. వెలుగును, అనిష్టపదార్థములను, అమేధ్యమును, అప్రశస్త వస్తువులను చూడఁగూడదు. శవమును జూచి హుంకరింపఁగూడదు. చైత్యములు, ధ్వజములు, తలిదండ్రులు వీరల నీడలలో నిలువఁగూడదు. రాత్రులయందు దేవాలయములు, చైత్యములు, చత్వరములు, చతుష్పథములు, ఉద్యానవనములు, శ్మశానములు, వధ్యస్థానములయందును సంచరింపఁగూడదు. శూన్యగృహమును, అరణ్యమును, ఒంటరిగా ప్రవేశింపఁగూడదు. పాపవృత్తులును, స్త్రీలభృత్యులు, మిత్రులు నైనవారును—వీరిని ఆశ్రయించఁగూడదు. ఉత్తములతో విరోధింపఁగూడదు. నీచులతో కలహింపకుము. పాపాత్ముని తలఁపున కైన రానీయకుము. అనార్యుని ఆశ్రయించకుము. ఎవరిని భయపెట్టకుము. అతిసాహసమును, అతినిద్ర, అతిజాగరము, అతిస్నానము, అతిజలపానము, అతిభోజనము, వీనినిమానుము. చాలసేపు గొంతు కూర్చుండకుము. పాములను సమీపింపకుము. కొమ్ములుగల వానిని, కోరలుగలవానినిగూడ సమీపింపకుము. ఎదుటిగాలి, ఎండ, మంచు, పెద్దగాలి వీనిని విడువుము. జగడము సేయకుము. అగ్నిని జాగ్రత్తగా నుపాసింపుము. అశుచియై అగ్నిని ప్రజ్వలింపఁ జేయఁగూడదు. ఆయాసము తీరకమునుపును, ముఖము కడుగుకొనక పూర్వమును, దినమొలతోడను స్నానము చేయఁగూడదు. స్నానముచేసిన వస్త్ర

ముతో తలతుడుచుకొనఁగూడదు. వెండ్రుకల చిగుళ్ళను జాడించఁగూడదు. స్నానమునకు పూర్వము కట్టుకొనిన వస్త్రములను మఱల కట్టుకోఁగూడదు. రత్నములు, నేయి, పూజ్యవస్తువు, మంగళకర ద్రవ్యములు, పుష్పములు, వీనిని తాకకుండ ప్రయాణము చేయఁగూడదు. పూజ్యవస్తువులకు మంగళద్రవ్యములకు అప్రదక్షిణము చేయఁగూడదు. ఇతరవస్తువులకు ప్రదక్షిణము చేయఁగూడదు.

“ చేతిలో రత్నాభరణాదులు లేకుండగను, స్నానము చేయకుండగను, మడివస్త్రము కట్టుకొనకుండగను, జపము చేయకుండగను, హోమము చేయకుండగను, దేవతలకు నివేదన చేయకుండగను, పితృదేవతలకు భాగము ఈయకుండగను, ఆచార్యులు, అతిథులు, ఆశ్రితులు వీరిని సత్కరింపకుండగను, గంధము పూసికొనకయు, పూలదండలు ధరింపకయు, కాళ్ళు, చేతులు, ముఖము కడుగుకొనకయు, నిర్మల ముఖుఁడుగాకయు, ఉత్తరముఖముగా నుండకయు, స్థిరచిత్తుఁడుగాకయు, భక్తిహీనుఁడు, అనాచారుఁడు, ఆకలిగొని యున్నవాఁడు వీరు యెదుట నుండగను. దుష్టపాత్రములయందును, అదేశమును, అకాలమునందును, సమ్మార్దముగల చోట్లయందును, ముందు అగ్నికి సమర్పింపకయు, ప్రోక్షణోదకములతో ప్రోక్షింపకయు, మంత్రములతో అభిమంత్రింపకయు, నిందించుచును, చెడినదియు, విరోధులు తెచ్చినదియు నగు అన్నమును భుజింపఁగూడదు. మాంసములు, అల్లము, ఎండించిన కూరలు, ఫలములు, మిఠాయి మున్నగు భక్ష్యములు తప్ప నిన్నటివస్తువులను (పర్యుషితములను) వేనినిఁ దినఁగూడదు. పెరుగు, తేనె, ఉప్పు, పిండి ఉదకము వీనిని మిగుల్పకుండ పుచ్చుకొనఁగూడదు. రాత్రి పెరుగు పుచ్చుకోరాదు. పిండిలో నేయి, శర్కర కలుపకుండ భుజింపరాదు. అర్ధరాత్రి భుజింపఁగూడదు. అన్నము తినకపూర్వము తినఁగూడదు, వెంటవెంటనే భుజింపరాదు. అధికముగా భుజింపరాదు. రెండుమారులు

తినరాదు. పిండిని తినునపుడు నడుమ నీరు త్రావరాదు. పండ్లతో నమలకుండ మ్రింగరాదు.

"వంగియున్నపుడు తుమ్మరాదు, తినరాదు. వంకరగా పరుండరాదు. మలమూత్రాదుల వేగమును తీర్పకుండ ఇతరకార్యములు చేయరాదు. ఎదురుగాలి, అగ్ని, ఉదకము, సూర్యచంద్రులు, బ్రాహ్మణులు, గురువులు వీరి కెదురుగ ఉమియరాదు. అపానవాయువు, మలమూత్రములు విడువరాదు. మార్గమున మూత్రమును విడువరాదు. జనసమ్మర్ధముగల చోట్లను, అన్నము భుజించునపుడును, జపము, హోమము, విద్యాభ్యాసము, బలిదానము, మంగళకార్యములు చేయునపుడును కాండ్రించి ఉమియరాదు.

"స్త్రీలకు అవమానము చేయరాదు. అతిప్రీతి కలిగింపరాదు. అధికార మీయరాదు. బహిష్ఠయైన స్త్రీతోడను, రోగగ్రస్తురాలితోడను, అపరిశుద్ధురాలితోడను, అప్రశస్తురాలితోడను, కురూపిణితోడను, అనాచారురాలితోడను, అధీరతోడను, తెలివిలేని దానితోడను, కామములేనిదానితోడను ఇతరుని కామించిన దానితోడను, ఇతరుని భార్యతోడను ఇతరజాతి స్త్రీతోడను, సంభోగము చేయరాదు. చైత్యము చత్వరము, చతుష్పథము, ఉపవనము శ్మశానము వధ్యస్థానము, నీలాంటి రేవులందు, ఓషధులు గలచోట దేవబ్రాహ్మణ గృహములయందు, సంధ్యాకాలములయందు, ఏకాదశిమున్నగు నింద్యతిథులయందు, అశుచిగ నుండి, వీర్యవృద్ధిని గలిగించు ఔషధములను సేవింపకయు, సంతోషముతో నుండకయు, భుజింపకయు మిక్కుటముగ భుజించియు, కష్టదశయందున్నపుడును, మూత్రవేగమును అడచిపెట్టియు, ఆయాసపడియున్నపుడును బహిరంగముగను సంభోగము చేయరాదు."

"సత్పురుషులను, గురువులను నిందింపరాదు. అశుచియై, ఆభిచారికకర్మ, చయిత్యసేవ, పూజ్యులపూజ, వేదాధ్యయనము—వీనిని చేయరాదు.

ఉఱుములు మెఱుపులు ప్రబలియున్నపుడును దిక్కులు ప్రకాశవంతములు గాకుండు నపుడును, అగ్న్యుత్పాతము సంభవించినపుడును, భూకంపము కలిగి నపుడును, మహోత్సవ సమయము నందును, ఉల్కలు పడునపుడును, చంద్రసూర్యగ్రహణ సమయములయందును, చంద్రుడు క్షీణించియున్న తిథి (అమావాస్య) యందును, ప్రాతస్సాయం సంధ్యల యందును, గురువు చెప్పకుండగను, అక్షరస్ఖాలిత్యములు కలుగు నట్లును, దీర్ఘమాత్రగను, హ్రస్వముగను, స్వరహీనముగను, పదముల పొందిక లేకుండగను, అతివేగముగను మిగుల మెల్లగను, బిగ్గరగా గాకుండగను, మెల్లగా గాకుండగను వేదాధ్యయనము చేయవలెను."

సమయమును దాటబెట్టరాదు. నియమమును పాడుచేయరాదు. పోగూడని స్థలములలో రాత్రిళ్ళు తిరుగరాదు. సంధ్యాకాలముల యందు భోజనము, అధ్యయనము, స్త్రీలతో కేళి, నిద్దుర చేయరాదు. బాలురు, వృద్ధులు, లుబ్ధులు, మూర్ఖులు, క్లిష్టులు, నపుంసకులు—వీరితో స్నేహము చేయరాదు. కల్లుత్రాగరాదు. జూదమాడరాదు. వేశ్యలతో స్నేహము చేయరాదు. రహస్యమును వెలిబుచ్చరాదు. ఎవరిని అవమానము చేయరాదు. అహంభావము ఉంచుకొనరాదు. అసమర్థుండై యుండరాదు. చతురుడు కాకుండరాదు. అసూయపడరాదు. బ్రాహ్మణులను దూషింపరాదు. గోవులను కొట్టరాదు. వృద్ధులను, గురువులను, జనసంఘమును, రాజులను ఆక్షేపింప రాదు. అతిప్రసంగము చేయరాదు. బంధువులను, తనమేలుగోరువారిని, ఆపత్తులలో రక్షించినవారిని, తనరహస్యమును దెలిపినవారిని విడువరాదు."

అధైర్యపడరాదు. మితిమీరిన ఓర్పు వహింపరాదు. భృత్యులను పోషింపకుండ నుండరాదు. స్వజనుల యెడల అనుమానపడరాదు. తానొక్కడే సుఖమును అనుభవింపరాదు. దుఃఖమును కలిగించు స్వభావమును ఆచారము, సాహాయ్యము—వీనినిగలిగియుండరాదు. అందఱను నమ్మరాదు. నమ్మకయు ఉండరాదు. ఎల్లపుడును విచారించుచు నుండరాదు.

"గుణము తెలిసికొనకుండ ఎవనిని ఎందునను ప్రవేశపెట్టఁగూడదు. ఇంద్రియములకు వశపడగూడదు. మనస్సును చంచలము కానీయఁగూడదు. బుద్ధికి ఇంద్రియములకు అతిభారము కలిగింపఁగూడదు. దీర్ఘాలోచనము చేయగూడదు. దీర్ఘక్రోధమును దాల్పఁగూడదు. అత్యానందపడరాదు. శోకముతో నుండగూడదు. కార్యసిద్ధియందు పొంగిపోవుటయు, కార్యహానియందు క్రుంగిపోవుటయు తగదు."

"శరీరము అస్థిర మని జ్ఞాపక ముంచుకోవలెను. హేతువు యొక్క ప్రభావమును గమనించి యుండవలెను. కార్యములు చేయుటయందు శ్రద్ధగలిగియుండవలెను. కార్యమైన తరువాత "కృతకృత్యుడనైతి" నని విశ్వసించి యుండగూడదు. తనకు కలిగిన అపవాదమును స్మరించుకొనుచుండరాదు. అశుచిగా నుండునపుడు ఉత్తమములగు నేయి, అక్షతలు, నువ్వులు. కుశ, ఆవాలు, వీనితో అగ్నియందు హోమము చేయగూడదు. హోమానంతరము "నాశరీరమునుండి అగ్ని పోకుండ నుండుగాక: వాయువు నాకు ప్రాణము లొసంగుఁగాక: విష్ణువు నాకు బలము నిచ్చుగాక: ఇంద్రుడు పరాక్రమమును ఇచ్చుగాక: పవిత్రములగు తీర్థములు నాలోఁ బ్రవేశించుఁగాక" అని తన్ను తానాశీర్వదించుకొనవలెను. ఆపోహిష్ఠేతి మంత్రముతో ఉదకమును స్పృశింపవలెను. పెదవులను రెండుమారులు ఉదకముతో పరిమార్జ

నము చేయవలయును. పాదములకు ప్రోక్షించుకొని ఇంద్రియములను తాకవలెను. ఉదకముతో ఆత్మను, హృదయమును, శిరస్సును తాక వలయును. బ్రహ్మచర్యము, జ్ఞానము, దానము, మైత్రి, కరుణ, సంతోషము, కోరిక వీనియెడల ఆసక్తుండై యుండవలెను."

## —• హిందీగాదు—ఉరుదూ •—

పండిత మదనమోహనమాళవ్యగారు, గాంధిమహాత్ములు మున్నగు దేశీయప్రముఖులు ఏదో యొక కుంటియాధిక్యమును జూపి భారతదేశముయొక్క సామాన్యభాషాపీఠమున హిందీని ప్రతిష్ఠించి, తగు సంస్థలను నెలకొల్పి తద్భాషాభ్యసనము సాగించుచున్నారు. దేశమున అనేకులు హిందీవ్యామోహములోఁ జిక్కియున్నారు. యుగ యుగాంతములనుండియు ఈదేశమున సామాన్యభాషయైయున్న సంస్కృతమును తొలఁగించుటయు, ఒకప్రాంతపుభాషనుదెచ్చి దేశభాషల మీఁద కూర్చుండఁబెట్టుటయు చాలసాహసము. సదసద్విచారపూర్వక మగు తారతమ్యచర్చను దూరముగా నుంచు అస్వాభావికావేశము ప్రబలియున్నపుడు ఇట్టిదివింతలలో చేరదు. గాని ఆహిందీకి గూడ నేడు తిరస్కారము కలుగుట గమనింపఁదగిన చక్కని విషయమై యున్నది.

౨౯-౧౨-౨౩ తేదీని కాకినాడ నగరమున జరిగిన అఖిలభారత సాహిత్య సమ్మేళనమున కొందఱు ప్రముఖులు ఆంధ్రులకు హిందీవనికి రాదనియు, ఉరుదూ ఏర్పడవలె ననియు తీర్మానము గావించినారు. ఆ తీర్మానము పైవాక్యమువలె ఆపాతకఠినముగ లేదు; గాని భావము అదే. దాని గమనిక యిట్లున్నది. "సంస్కృతముతో మిశ్రితమైన ప్రయోగ హిందీ సాహిత్యమునకు తప్ప సామాన్యభాషగానుండుటకు వీలులేదు ఉరుదూ మిశ్రిత మగు హిందీ యుండవలెను." నయచాతు ర్యమున ఆరితేఱిన మహమ్మదాలీ ప్రభృతులగు మహమ్మదీయ సోద రులు ప్రయత్నించి తీర్మానమున కిట్లు మార్దవమును గలిగించిరి. గాని నీటిలో నున్న బడబాగ్నివలె మృదుశబ్దములతో కూర్పఁబడిన ఈనుం జుల వాక్యములయందున్న శక్తి హిందీని తునాతునకలు చేసి ఆకస మున ఎగఁజిమ్మివేయుచున్నది.

సంస్కృతము లేని హిందీ యనిన ఉరదూభాష యన్న మాట. మా దేశభక్తసోదరులు ఈనిర్వచనమున కంగీకరింపకేని జీవము లేని మృతకళేబర మన్నమాట.

ఇంతవఱకును వివిధప్రాంతవాసులగు భారతీయ లొకచో కలిసినపుడు తమభావములను ఇంగ్లీషులో తెలుపుకొనియెడివారు. ఇప్పుడు తురకభాష వచ్చినది. అర్థాత్తు మన కట్టిభాష లేదన్నమాట. చాలు నీసౌభాగ్యము. ఆంగ్ల భాషవలన జాతీయతను గోలుపోయిన మా భారతీయసోదరులకు ఇంతకంటె మంచిమార్గములు కనఁబడవు. స్వరాజ్యము వచ్చిన తరువాత భారతీయులకు లేని కొన్ని అసాధారణములైన ప్రత్యేకపుహక్కులు మహమ్మదీయులకు స్థిరపడుట కిప్పుడు ఈతీరున ఒక్కొక్కటిచొప్పున మంచి పునాదులే పడుచున్నవి

## —— •తనకుమాలిన ధర్మము •——

గతించిన డిసెంబరు నెలలో దేశీయమహాజనసభతో బాటు అఖిల భారతహిందీసాహిత్యసమ్మేళనముయొక్క సమావేశముగూడ జరిగినది. దానిని తలపెట్టి దీక్షబూని నిర్వహించినవారు ఆంధ్రులేయైనపుడు హిందీసాహిత్యసమ్మేళనము ఆంధ్రదేశమున జరుగుట యేమిటి యని ఆశ్చర్యపడ నక్కరలేదు. ఆంధ్రులు హిందీయెడల చూపుచున్న యనురాగ మనంతము. దానిని గుఱించి వెచ్చించుచున్న ధనము గూడ అపారముగ నున్నది. హిందీభాష మాతృభాషగా గలవారు ఆంధ్రులయెడల చాలకృతజ్ఞత చూపవలసి యున్నారు.

ఆంధ్రులు హిందీభాషను గుఱించియేగాదు. కోయభాషను గుఱించి శ్రద్ధచేసినను మాకేమియు నాక్షేపణలులేవు; గాని హిందీని గుఱించియు, హిందీసాహిత్యసమ్మేళనమును గుఱించియు, అహోరాత్రములు పాటుపడిన—పడుచున్న మాయాంధ్రసోదరులు ఆంధ్రమును గుఱించియు, ఆంధ్రసాహిత్యపరిషత్తును గుఱించియు ఏమి పని చేసిరో యెఱుంగఁ గోరెదము. ఆంధ్రసాహిత్యపరిషత్తు ఎదుగుబొదుగులులేక నామమాత్రమును, వ్యర్థమైకప్రయోజనమునై యుండుట వీరి కేల

కాన్పింపలేదో తెలియదు. ఆంధ్రభాషను గుఱించిగాని, ఆంధ్రసాహిత్యపరిషత్తును గుఱించిగాని పనిచేయక పోయినను హిందీని ప్రోత్సాహించినంతమాత్రమున విజ్ఞానమబ్బినచో దేశీయులకు వికాసము అబ్బినచో అంతకంటె కోరదగినది లేదు; గాని దానివలన ప్రయోజనములకంటె నష్టములు అధికముగఁ గాన్పించుచున్నవి.

ఇదివరలో ఆంధ్రమునకు ఇంగ్లీషు ఎట్టి యపకారము గావించినదో యిప్పుడు హిందీ అట్టి యపకారమునే గావించుచున్నది. ఆంధ్రులకు ఇంగ్లీషుమీఁదనున్న వ్యామోహము హిందీమీఁదికి మరలినది. గాని యిప్పుడయిన ఆంధ్రముమీఁదికి రాలేదు. ఆంధ్రము ఉదాసీనముగఁ జూడఁబడఁదగినదా? ఆంధ్రులకు ఆంధ్రము ప్రధానము గాదా? ఆంధ్రమే రాని ఆంధ్రులు హిందీని నేర్చుకొనుటలో అర్థము గలదా?

ఆంధ్రదేశములో ఆంధ్రగ్రంథకర్తలకు ఆదరము లేదు. హిందీ గ్రంథముల వ్యాపకముమాత్రము పెరుగుచున్నది. ఆంధ్రమున మంచి వాచకపుస్తకములు లేకపోయినను హిందీవాచకములు ప్రబలుచున్నవి. తెలుగుపత్రికలు గిడసబాఱుచున్నవి; గాని తెలుఁగుదేశమున హిందీ పత్రికల ప్రచారము విజృంభించుచున్నది. అతివిస్తర మేల?

ఆంధ్రులు అంతర్ముఖులు కాలేదు. ఆక్స్‌ఫర్డు మీఁద నున్న దృష్టి ప్రయాగమీఁద పడినది. దానిని మహాస్వదేశీయులు ఢిల్లీమీఁదికి త్రిప్పినారు. ఆంధ్రముమీఁద ఆంధ్రులకే యభిమానము లేనప్పుడింకెవ్వరు చూపెదరు?

ఈతనకుమాలిన ధర్మముయొక్క ఫలము అచిరకాలమునందే ఆంధ్రుల నెదుర్కొనఁగలదు. ఆంధ్రదేశమున పురోగమనము అప్పుడు గాని ప్రారంభముగాదు.

## — ♦ పొగాకు ♦ —

ప్రకృతమున రమారమి సన్నిగృహములలోను ఈపత్రఁపుటుపయోగ మెక్కుడుగ నున్నది. ఇంతయేల సకల గేహాధిష్ఠదేవతయై యున్నది. ఈదేవత ప్రపంచమున కెట్టియుపకారములఁ జేయుచున్నదో తెల్పుటకునావిధిగాయెంచి యొకచిన్న వ్యాసమును లిఖింప బూనితిని.

ఇది సుమారైదు శతాబ్దములకుఁ బూర్వమందున నాగరక ప్రపంచమం దెచటను లేదు. అప్పటికింకను నాగరక ప్రపంచమునకుఁ జాటున నున్న అమెరికా మున్నగు ప్రపంచస్థలములలో మానవభక్షణ సహితముఁ జేయుటకు సాహసించెడి యనాగరకుల మధ్యమున నుపయోగములో నుండెడిది. ఆవల నైరోపా మున్నగు ప్రదేశములకు కేతే మున్నగువారలచేఁ గొనిరా బడియెను.

ఆదిమమున దీని నైరోపా మొదలగు ప్రదేశములయందున నుపయోగములోనికిఁ గొనివచ్చుట కెత్నించిన సమయమునం దెన్నియో న్యాయచట్టములు రాజకీయులచేతను మతగురువులచేతను అనుకరణములోనికి గొనిరాఁబడియె. ఇందులకుఁ దార్కాణముగా రష్యాదేశమునం దొక చట్టమములులోఁ బెట్టబడెను. దాని ప్రకారముగ మొదట జుట్ట గాల్చిన నేరస్థుని దెబ్బలతో శిక్షించెడువారు. రెండవ పర్యాయ మానీచపు కరజమునే సలిపినయెడల ముక్కును కోసెడివారు. ఇంకను తెగించి మూడవ పర్యాయము సలిపిన జీవనమున కాశ యొదులుకొనవలసివచ్చెడిది. ఇటులనే ఇంగ్లాండునందు మొదటి జేమ్సుచక్రవర్తిగారు పొగాకు గాల్చినవారు శిక్షలకు బాధ్యులగుదురని చట్టముల బ్రచురించిరి. ఇట్లే అమెరికా పర్షియా మున్నగు ప్రదేశములయందును "నిషేధపుఁజట్టము" లమలులోఁ బెట్టఁబడుటచే దీని యుపయోగము నామమాత్రమైనను లేకుండ నశించినది. ఇప్పటికిన్నీ, బోస్టనునందున నీ "పొగాకు నిషేధపుఁ" జట్టము గలదు.

కాని కాలక్రమమున "యథా రాజా తథా ప్రజా" యనునట్లుగా నియేహ్యంపు టలవాటుల కనుగుణ్యములగు నీతిశూన్యులగు రాజులును, బెనిడిక్టువంటి మతగురువులును అధిపత్యమునకు రాగానే నిషేధపుఁ జట్టములును నిర్మూలము లయ్యె. శరీరారోగ్య వినాశకమైన యీ పత్రమునకుఁ బ్రాబల్యము హెచ్చి రానురాను సర్వదిగ్వ్యాప్తిఁ గాంచెను.

ఇఁక నీవస్తుగుణ పరిశోధనఁ గావింతము. రసాయన శాస్త్రజ్ఞులును ఓషధిశాస్త్ర వేత్తలును, తదితర వైద్యులును

పొగాకు ప్రాణాంతకమైన విషవస్తువ యని, ఏకగ్రీవముగాఁ జాటించియున్నారు. ఇందలి ముఖ్యమూలమునకు "నికోటైన్" అని పేరు. అది మిక్కిలి బరువైన తైలపదార్థము. ఒక పౌను యెత్తుగల పొగాకునందు, సుమారు మూడువందలయెనుబది వడ్లగింజలయెత్తు విషముగలదు; ఇందులో నొక వడ్లగింజలోఁ బదవవంతు విషము మూడునిముసములలో నొక కుక్క ప్రాణము తీయును. ఇందలి తైల సారము హత్యలాచరించుటకు మిక్కిలి యుపయోగము. ఐరోపా ఖండమందలి యొకచిన్న గ్రామమునకు జమీందారగు బొకర్మీ యను వాఁడుముప్పది సంవత్సరములకుఁ బూర్వము దన బావమఱిదిఆస్తినప హరించుటకై, ఈ పదార్థము నిచ్చి చంపెను. పిరిడైన్, పికోలైన్ మొదలగు విషపదార్థములును, గంధకమిశ్రమైన జలధాతువు. అంగా రకామ్లాది వస్తువులును యిందేఁ గలవు.

ఇది నిద్రావహమైనవస్తువు. క్షయరోగమునకును, పక్షవాతము నకు, అజీర్తిరోగములకును తల్లివంటిది. కొందఱు తమ యజీర్తిరోగ నివారణకై చుట్టలఁ గాల్చుచున్నామని చెప్పుదురు. కాని ఇది వైద్య శాస్త్ర విరుద్ధమైన విషయము. తత్కాలికగుణము గనుపించినటు లుండనోపుఁగాని భవిష్యత్తునందున దానిప్రభావమును వెల్లడిఁ జేయు ను. దీనికి, జీర్ణరసములలో నొకటియగు "జాఠరరసమును" వృద్ధిపొంద కుండఁ జేయు శక్తికలదు. అట్టి విషయములో నీ పొగాకు జీర్ణకారి యెట్లగునో తెలియదు.

మనవారిలో ననాదినుండియుఁ దెలిసిన పండితులలోను, ప్రస్తు తపువారియందును, విద్యార్థులయందునను, పొడుముఁబీల్చుట యొక ఆచారమై యున్నది. పండితులు పొడుము బీల్చుట యొకమర్యాద యని తలంతురు; కాని నే నిద్దానిని మర్యాదభంగమునకుఁ గారణమని తలంతును విద్యార్థులు పరీక్షాదినములలో నిద్ర నాపునని యీ దురల వాటులఁబడి, క్రమక్రమముగా దాని ననుసరింతురు, కాని దీనివలనఁ గలుఁగు నష్టములఁ గనరైరి. ఇది నాసికాంతర్భాగమునఁ గల పొరకు

భంగమును కలుగఁజేయును. ఒకప్పుడు కొరుకుపుండను మహారోగమును పుట్టించును.

పొగాకు కాలక్రమమున జ్ఞాపకశక్తిని రూపుమాపి, కఠినహృదయులఁజేసి, నీతిదూరులుగ నొనర్చును. ప్రపంచమునఁగల త్రాగుడు, అపవిత్రితమున్నగు సర్వదుర్గుణములకును ప్రథమసోపానము.

ఇది సర్పమండూకాదిజంతువులఁజంపుటకుఁ దప్ప మిగిలిన వానికెద్దానికిని యుపయోగింపదు.

ఇంతయేల; పొగచుట్టలఁ గాల్చునట్టియు, పొడుముఁ బీల్చునట్టి వారలఁ జూడుడు. ఒక గొప్పసభ కేగినప్పుడుకాని, గొప్పయధికారి నెవ్వనినైనఁ జూడఁబోయినప్పుడుకాని, వస్తువుల విసర్జించవలయును కదా! వారిముందఱ జుట్టలఁగాల్చిన నెట్టియవమానము జఱుగునో మనకెల్లరకును తెలిసిన విషయమే. అదియుఁగాక మనలోఁ గొందఱిప్పుడు సభారంజకమగు ఘనసారలవంగాది సుగంధ వస్తుమిళితవటిని వీడి, దుర్వాసనాయుక్తమగు తాంబూలమును పొగాకుతోఁ గలిపి "కారాకిల్లీ" యనుపేర నుపయోగించుచున్నారు. ఛీ! ఎక్కడ నిలిచినను, కూర్చున్నను, దుర్గంధవ్యాప్తదాయకమైన యీనీచపు వస్తువుల నేల నుపయోగింతురు. నాసికాంతర్భాగమునుండి వెలువడు నాసాకిట్టంబుఁ గాంచ నెంత యేహ్యము! సోదరులారా! మర్యాదశూన్యము, దేహమనోనాశనకారణంబులు నగు పైనుదహరించిన పదార్థముల నుపయోగించి మీరు పాడగుటయే గాక భవిష్యత్సంతతికి నాశనముగొని వచ్చుచున్నారే, మీకు జనించు పుత్రులలో నూటికి సుగుణవంతు లెందఱు కలరో గమనింపుడు. ఇట్టి దుర్వృత్తులకు శిక్షార్హులెవ్వరు? జననీజనకులైన మీరేయని నొక్కి చెప్పనగును. ఆదిమమున మీస్వగృహమున మీరు, సుగుణయుక్తులై, మీబాలకులును, అట్లే యుండునటులఁజూచినచో వారు భవిష్యల్లోకమున కెట్టి యుపకార మొనర్తురో, ఎంతకాలము జీవింతురో, ఆలోచించి, ఇక ముందైనను మిమ్ములఁగూర్చియు, మీ యువకులఁగూర్చియుఁ దగు జాగ్రత్తఁ దీసికొని సహజాహారపానీయాది మార్గములం ద్రొక్కి పూర్వఆంధ్రమాతానూనప్రభావమును లోకమున వెల్లడిఁ జేయుఁడు.

— ఇంద్రుఁడు బాలమండనమున లింగప్రతిష్ఠ సేయుట. —

వ॥ అనవుడు జానశ్రుతమహీపతి. ౧౨౦

ఆ॥ "ఆర్య! చెప్పితివి గయాకూపికామహత్త్వము సవిస్తరముగఁ గ్రమముగాను.
బాలమండనము ప్రభావంబుగూడ మాకెఱుఁగఁజేయుమయ్య కరుణయుంచి.

కం॥ మఱియును నీస్థానమున న్సురపతి లింగప్రతిష్ఠ నూతనముగఁ జా
జరిపెను? దత్పూజనమున ధరణిజనులు పొరయఁగలుగు ఫలము లేమా". ౧౨౧

వ॥ అనిప్రశ్నించుటయు విశ్వామిత్రుం డిట్లనియె. ౧౨౩

కం॥ "శివలింగము నిలుపుటకై పవిధరుఁ డా క్షేత్రమధ్యభాగంబున నె
ప్డరనీబ్రహ్మర్షిముఖులను బవిత్రమగుస్థలము వేడె బాగుగ నపుడే ౧౨౪

సీ॥ ఎచట దితీదేవి యెంతయుం దపముండె సురల గెల్వఁగఁజాలు సుతుని గోరి
మరుదాహ్వయములతో గరిమమై నెచట నా దితి యుద్భవించిరి సుతులు పెక్కు-
రెచటఁ దత్సుతులెల్ల నింద్రుచే హతులయ్యు వృద్ధినొందిరిచాల మృతులుగాక
యొది మేధ్యతమమైన యుద్ధపదంబంచు మేటికిరీటి గాంచె నాఁటఁగోలె
నట్టి బాలమండనాఖ్యమౌ స్థానమా బాప తేగుదెంచి చూపుటయును
గ్రతుభుగీశ్వరుండు కలయ విలోకించి యిజ్యతోడ భక్తి నిట్టులనియె. ౧౨౫

తే॥ "సద్గురూ! శివలింగసంస్థాపనంబు సలుపఁదలఁచినవాఁడ నీస్థానమందుఁ
బ్రళయమునఁగూడ క్షతిలేనిభంగిదాని కొకముహూర్తంబు పెట్టు మత్యుత్తమంబు".

కం॥ అనియిటువక్కాణించుడుఁ దనమనమునఁ బెద్దప్రొద్దు ధ్యానించి యతం
డను "మాఘసితత్రయోదశి యినవాసరయుతముఁ బుష్యయుతాన్వితముగా. ౧౨౬

కం॥ అయి కడు బాగుగనున్నది. స్వయముగ శివలింగమీవు స్థాపింపుము. సం
క్షయమందకుండునది. హరిహరి! యాకల్పాంత మధికతాభ్యుదయంబై." ౧౨౭

కం॥ అనవిని యానందాంబుధి మునిఁగి శునాసీరుఁ డదియె ముహూర్తంబున గా
యనవాదనములతోడను మొనయుచుఁ బుణ్యాహఘోషములు సెలఁగంగన్.

ఆ॥ బాలమండనంబు పజ్జఁ దల్లింగ ప్రతిష్ఠఁజేసి భూమిదేవతలకుఁ
దనియఁ గుడువఁబెట్టి దక్షిణ యాఘాటుమనెడి స్థానమిడియె నగ్రభంగి. ౧౩౦

కం॥ మాంకాలమునందుండెడి, దింకం జుట్టును గరంబు నింపగు గోడల్
పొంకముగఁ గలిగినది సుగుణాంకా! యాస్థానమదె సమర్పితమయ్యెన్. ౧౩౧

తే॥ ఇట్లు సామాన్యముగనిచ్చి యెల్ల ద్విజుల కష్టకులజులఁబిలిచి "చంద్రార్క-కాలి
కంబుగా మీకుఁ బండ్రెండు గ్రామముల సమర్పణము సేతుఁ గైకొనుఁ డార్యులార!

క॥ కైకొనియవి యీలింగము వీఁకం జింతించు చెప్పుము విప్రులు ! "మనుఁ" దం
చీకరణిని వాకొనుటయుఁ బాకారింగూర్చి యిట్లుపలికిరి వారల్. ౫౩౩

ఆ॥ "విప్రధనము మఱియు విబుధులధనమును నటు తటాకభవము నల్పమేని
యెవఁడుతినునో వాని యేడేనుతరముల ప్రాప్తనులును గ్రిందఁబడఁగలారు. ౫౩౪

తే॥ అస్మదన్వయభవుఁ డెవఁడైన వానిఁ గుడుచుచో మే మధస్థలింగూలఁగల, మ
టంచు భయమందుచున్నార, మందువలన నీవస్మదుక్తము గావింప నొప్పుకొనము"

చం॥ అనియిటు లేద్దు రాడుటయు నప్పుడుఁ ప్రవరత్రయాప్తకీ
ర్తనుఁడగు దేవశర్మ కృతపాపుగుప్రకారుఁడు శక్రుఁ డేదిరో
మనమున నుండియుండు టనుమానముఁ జేసి ధరుంబు భక్తియుఁ
బెనఁగొన దోసిలొగ్గి యతిపేశలభావతతోడ నిట్లనున్ ౫౩౬

పంచచామరము॥ "అపుత్రకుండనైన నాదు నన్వయంబు వర్ధిలన్
గృపం గృశజ్ఞుఁ డింక దేవరిక్థవర్జ్యుఁడుండునా
సుపుత్రుఁ ధర్మవేత్త నిచ్చుచోఁ ద్వదీయ శంభులిం
గపూజసేతు" నా నతండు కౌతుకంబునొందుచున్ ౫౩౭

సీ॥ సకలప్రపంచంబు తృణముగాంచెడి దాఁకఁ దనసంతతిని నిల్ప దక్షుఁడగుచు
మనుజులెల్లరుగూడఁ దనుజూచి నేర్చుకో వ్రతముఁబూని యథార్థవాదియగుచు
దుష్కృతి యెంతయు దూరంబునకుఁబోవ ననవరతంబు ధర్మాత్ముఁడగుచు
దేవస్వమును దానుదినకుండుటే కాక ప్రజల కయ్యది బోధపఱచుకొనుచుఁ
జెలఁగునట్టి సుతుఁడు గలిగెడునీకుఁ, దదన్వయమునఁబుట్టు నాత్మజాతు
లందఱుం గడు స్మహాత్మత వేదపారగతఁ దత్సమానులగుదు రిలను ౫౩౮

క॥ మఱియొకవ్యాహారంబును ధరణీసురవర్య ! వినుము, తద్విధమున నిం
దరుదెంచియున్న భూసురవరులందఱుఁగూడ వినుఁడు. వక్కాణింతున్. ౫౩౯

ఆ॥ బాలమండనాఖ్యఁ బరఁగు నీతీర్థమం దీచతుర్ముఖముల నెసఁగునట్టి
యలఘులింగ మనఘ మస్మత్ప్రతిష్ఠితంబైనయది చతుర్ముఖాజ్ఞవలన ౫౪౦

క॥ ఎవరీతీర్థంబునఁదా మవగాహనమాచరించి యాహ్నికమగునై
నవహితులై పితృతర్పణము విధింతురో తత్పితలకు మోక్షముగలుగున్. ౫౪౧

తే॥ ఈ మహాదేవునకు భక్తి నేనొసఁగిన ద్వాదశగ్రామములనుండు మేదినీసు
రులు పితృశ్రాద్ధమున ముందు సలుపవలయు నీమహేశ్వరుశ్రాద్ధంబు నేమమునను.

తే॥ అట్లు ప్రథమంబు గావించి యధికభక్తి నిజపితృశ్రాద్ధకృత్యము సల్పుకొనిన
విఘ్నములులేక యెంతయు వృద్ధిగలుగుఁ, గాకయుండిన విఘ్నము ల్గలిగితీఱు.

తే॥ మాఘశుక్లత్రయోదశి మఱవకుండ వచ్చి యిచ్చటి కాగ్రామవాసిజనులు
బాలమండనమునఁ గ్రుంకి భక్తి నేతదాఖ్యలింగంబుఁ బూజింప నబ్బు సుగతి.

కం॥ మామకలింగార్పిత సద్గ్రామస్థద్విజుల కెంత కాలంబునకేన్
మైమఱచి పీడసలిపెడి పామరు లగుదురు వినాశభాజులు ధరణిన్. ౫౪౫

తే॥ ఆసముద్రసరస్సులో నవనిమీఁద మను సుతీర్థంబులన్నియు మాఘమాస
మందు శుక్లత్రయోదశి నరుగుదెంచు బాలమండనమునకు నోపాపులార"! ౫౪౬

ఆ॥ అనియుపన్యసించి యగ్రమందున్నట్టి యష్టకులఁ గాంచి యాగ్రహమున
వీరలేడుగురును వినక నామాట కృతఘ్నులైరి. కాన దండ్యులింక. ౫౪౭

—♦ ఇంద్రుం డష్టకులనాగరుల శపించుట. ♦—

కం॥ కృతమును మఱచిన సకలక్షితిజనముం గూర్చి యిటులఁ జెప్పినవాఁ డా
ఋషివాజియును స్వాయంభూసుతుఁడును నగు మనువు మున్ను-చూడుఁడు దానిన్

శ్లో॥ కృతఘ్నేచ సురాపేచ చోరే భగ్నవ్రతే శఠే
నిష్కృతి ర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః. ౫౪౯

సీ॥ సర్గాదిగా వేదశాస్త్రంబులన్నింటిఁ బాలించుకొనివచ్చు బ్రాహ్మణులను
దధిపయోఘృతముల ధరణీజనంబును దృప్తిపెట్టుచునుండు ధేనువులను
సృష్టికృత్యమునఁ దత్స్రష్టకు బాసటై ప్రజ వృద్ధిఁజేసెడి భామినులను
బిట్టుజతంగూరి కట్టినఁ గొట్టినం బ్రతిసేయలేనట్టి బాలకులను
నెవరి తెరువుఁ బోక యొచటనో కూర్చుండి ధ్యానమును బొనర్చు తాపసులను
దునుమఁదగదు. కాన దోషులేయగుదురు గాక, వీరి దునుమఁగడఁగ నేను" ౫౫౦

మ॥ అనివారిచ్చి సదర్భమైన జలమున్ హస్తంబునం బట్టి "ని
ర్ధనులై పోఁగలవారు వీరు, ఘటియుం దద్వంశజుల్గూడ నే
జనులన్ యాచనఁజేసి యన్నమును వస్త్రంబున్ సమార్జించి జీ
వనముం జేతురొ నష్నుఁబోలెఁ దుద కవ్వారిన్ విసర్జించుచున్. ౫౫౧

ఆ॥ కఠినమానసులును గరుణావిహీనులుం దిండిపోతు లగుచుఁ దిరుగుచుండు"
రనిశపించి మరల నవశిష్టనాగరభట్టులను గుఱించి యిట్టులనియె. ౫౫౨

ఆ॥ "ఇమ్మహేశు మిమ్ము నెల్లరఁ బూజించి భూతలీయసుఖము పొందుపొంటె
నైదుదినములుండు నబ్ధాంతమందిందుఁ, జూపుఁడెయ్యవారుఁ జోటొకండు". ౫౫౩

కం॥ అనియిటు వాక్రుచ్చుటయును ననుకూలంబైన స్థలము నగుపఱచి వెసన్
మనముల నుప్పొంగుచు నిట్లనిరి శునాసీరుతోడ నవనీదేవుల్. ౫౫౪

ఆ॥ "బ్రహ్మకాలమనుచుఁ బంచరాత్రములును మనుజలోకసుఖము ననుభవింపు,
మలఘుగీతవాద్యములతోడ నీవు మహోత్సవంబు సేయుచుండు మచట" ౫౫౫
క॥ అనవిని యత్యంతంబును మనమున సంతోషమంది మఘవంతుండ
య్యనఘద్విజులకుఁ బూజన మొనరిచి స్వర్లోకమునకు నొయ్యనఁ జనియెన్. ౫౫౬
ఉ॥ మాఘసితత్రయోదశిని మర్త్యులు దేవమునింగి యొక్కమా
ఱా ఘనమైనతీర్థముల యన్నిట మున్గి గడించునట్టి సం
శ్లాఘనయోగ్యపుణ్యమును జక్క గడింతురొ తాదృశప్రభూ
తాఘహ బాలమండన మహాత్త్వము సర్వము నీకుఁ జెప్పితిన్" ౫౫౭

— గౌతముఁ డింద్రాహల్యల శపించుట. —

వ॥ అనియిట్లు నొడువుటయు సానర్థరాపురందరుండు. ౫౫౮
తే॥ "ఏలభూలోకమందున నింద్రునికి రేనుదినములవఱకె యఁం చేరుపడియెఁ?
దక్కవేలుపులుం బోలెఁ దక్కనాళ్ళు మనుటకభ్యంతరం బేమి? యనఘ! చెపుమ
ఆ॥ వత్సరాంతమందు వచ్చి యాపాకారి యవనినుండునట్టి యహములెవ్వి?
యిందుకొఱకుఁగాను నేనేల నిర్ణిష్ట? మంతయును వచింపవయ్య నాకు." ౫౬౦
వ॥ అనియడుగుటయు విశ్వామిత్రుండు వెండియునిట్లనియె. ౫౬౧
ఆ॥ "పంచరాత్రములకుఁ బైని ధరాస్థలి నేలయునికి లేదొ యింద్రునకును
వినిచెదం దదర్థ మనఘాత్మ! యొకగాథ, యవహితుండవగుచు నాలకింపు ౫౬౨
క॥ అలనాఁ బృహత్కల్పంబున నెలమి బృహత్సేనుఁడనెడి యింద్రుఁడు త్రిజగం
బులకు దొరయయి యటం బూజలఁ గైకొను చసురదర్పసంహారకతన్. ౫౬౩
క॥ ఒకసమయంబున నాతం డకుటిలుఁడగు గౌతమర్షి యబల నహల్యన్
సకలాంగసుందరిం గని ప్రకటంబగు మోహమునను బ్రతిదివసంబున్. ౫౬౪
చం॥ సమిధలకున్ ఫలంబులకు సంయమి మిత్రులతోడఁ దా నర
ణ్యమునకుఁ బోవువేళలను నాకమునుండి ధరిత్రి డిగ్గి యా
కమలదళాక్షి నెంతయును గౌఁగిటఁ జేర్చి రమించుచుండుడున్
సమిదళనుండు గౌతముని సన్నిధి కేగి వచించె నంతయున్. ౫౬౫
చం॥ అదివిని తత్క్షణంబ యతఁ డాత్మగృహంబునకేగి చూచుచున్
మదవతిఁగూడియుండు శతమన్యుఁడు దిగ్గనలేచి భీతిమైఁ
జెదరినవస్త్రమేని సరిచేసికొనం దడవుండకున్కి న
య్యదిరెయొలలిం బలాయనపరాయణుఁడయ్యె. నిఁకేమి చెప్పుదున్. ౫౬౬

పంచచామరము॥ అహల్యగూడ వచ్చినట్టి యాత్మనాథుఁ జూచి తా
మహాభయంబుతోడ లేచి మ్లానమైనయాస్యమున్
మహింబడంగ వంచి మాఱుమాటలేకయుండ నా
గ్రహంబుఁ బెంచి గౌతముండు కన్నులెఱ్ఱఁజేయుచున్. ౫౬౮

శా॥ "శక్రా! నాప్రియభామినిం జెఱచి - తీచ్చెదంబు దూష్యంబు శా
దే. క్రూరా! వృషణంబు లూడిపడు నీ కీదుష్కృతిం జేసి - యీ
వక్రత్వంబున కిద్ది చాలమిని నీవక్త్రాంబుజం బింకయో
న్యాక్రాంతంబగు - వేయియోనులకు నీ వాధారమై తేగుమా. ౫౬౯

తే॥ మూఁడుజగములదొరనని మురియఁబోకు ఖలుఁడ! వాననె యాపదల్గలుగునీకు-
నందు భూలోకమునను నీ వడుగుపెట్టఁ బగిలి తల తత్క్షణమ వేయిబ్రద్దలగును"

మ॥ అని యింద్రున్ శపియించి పత్నిదెస కాస్యంబున్ వెసం ద్రిప్పి క
న్గొనలన్ నిప్పులురాలఁ జూచుచును నిగ్గుల్వల్కి భర్త్సించుచున్
"జనదూష్యంబగు చేత చేసితివి - కానన్ రాయివై యుండు పో"
మ్మని యిబ్భంగి శపించులే తడవుగా నయ్యోష ఱాయైపడెన్. ౫౭౦

కం॥ వృషయాను దచ్ఛాపంబున వృషణములం గోలుపోయి వేవిక్త్రము వే
ఝషకేతునిండ్లుగలదయి మషిఁబూసిన కాగితంబుమాదిరి గాఁగన్. ౫౭౧

ఆ॥ వ్రీడతోడ నేగి విజనమౌ మేరుకందరముఁ జొచ్చెఁ దనదుపురికిఁ జనక-
తెలియఁజాలరెరి తెఱఁగఁటు లాతండు కొండబిలములోన నుండినుంట. ౫౭౨

కం॥ నాక మరాజకమగుటను భీకరదానవులచేతఁ బీడితులగుచున్
బాకాభిహూతిలేమికి శోకించిరి వార-లతనిసుదతియు నటులన్ ౫౭౩

చం॥ భయపడుచున్ సుపర్వగురుపార్శ్వముఁ జేరి "మహాత్మ! మామక
ప్రియుఁ డెటకేగెనయ్య" యని పృచ్ఛయొనర్చుటయుం జిరంబు ధ్యా
నయుతుఁడునుండి జ్ఞాననయనంబున వీక్షణఁ జేసి చక్కఁగన్
రయముగ దేవమంత్రము పురందరుసన్నిధికేగి యిట్లనున్. ౫౭౪

ఉ॥ "ఏమిది రాజ్యభోగములనెల్ల విసర్జనఁజేసి నిర్జనం
బౌ మహి నాశ్రయించితివి - యన్నియుఁ గల్గియు ధ్యానమూనితీ-
వేమినిమిత్త? ముగ్రతప మీగతిఁ జేయుచునుంటి - వెండి నీ
కేమితటస్థమయ్యె?" ననియెంతయుఁ బ్రశ్నముఁ జేయఁ జేయఁగన్ ౫౭౫

కం॥ భగవదనతఁ గడుసిగ్గున మొగమెత్తఁగలేక బాష్పములఁ దడిసి యొడల్
విగతాభముగా దైన్యం బగుపఱచుచు జంభభేది యపుడిట్లనియెన్- ౫౭౬

క॥ "ఏల నిఁక నెంతమాత్రము త్రైలోక్యముగూడఁ జూడు తద్గౌతముఁడు
ఋష్యాలంబుగ నాకియ్యెడ నేలీలలుగలయవస్థ యేర్పడినదియో. ౫౭౭

క॥ వేయోనిభిన్నములగల యీయాననమునను బోయి యేమని యాడై
తేయారుల సంభావనఁజేయంగలవాఁడ ? నీవె చెప్పు మాచార్యా ! ౫౭౮

క॥ శోభాయమాన యాశచి, నాభార్య, తదంగనాజనమతల్లి, ముఖం
బీభగముఖమునఁజని నే నేభంగిని ముద్దులాడి యిష్టముదీర్తున్ ? ౫౭౯

ఆ॥ మర్త్యలోకమునను మహనీయులెల్లరు నాకుఁజేయుపూజ నష్టమయ్యె
నొక్కకారణమున నుగ్రుఁడై గౌతమసంయమీంద్రుఁ డిచ్చు శాపమునను" ౫౮౦

క॥ అనియిటువాపొచ్చుచుఁ గడుఁ బనవుచు వేలుపులతోడఁ బయనంబై య
మ్మునిశార్దూలముపాలికిఁ గొనకొని పనివిని స్వయంబ గురుఁ డిట్లనియెన్. ౫౮౧

చ॥ "హరిహయుచేత వీడఁబడినట్టి జగంబులు మూఁడుగూడ న
ధ్వరములులేక దానవులబాధల కగ్గములయ్యె, సిగ్గునన్
మరల స్వకీయరాజ్యమును మానసమందునఁ గోరఁడాతఁ డే
త్తెఱఁగున నేని శాపమును ద్రిప్పి యనుగ్రహమించి సన్మునీ ! " ౫౮౨

చ॥ అనవిని గౌతమర్షి " యయథార్థముగాదు మదుక్తి, నోటవా
తొనఁబడు దానిలోన నిఁకఁ గొంచెమొనర్చ" ననన్ సురేజ్యుఁ "డీ
యనిమిషులెల్లరున్ హరియు నట్లు స్వయంబుగ నమ్మహాత్ముఁడన్
వినయముతోడవచ్చి నిను వేఁడుమనండినవారి చూడుమా. ౫౮౩

తే॥ నలువనుడి కన్యథా నీవు నడవఁగూడ, దట్లుగావున విప్రేంద్ర ! యమరపతికి
శాపమోక్షముగావించి సత్కరింపు" మనుచు నతని మనోదార్ఢ్యమును నెఱింగి

ఉ॥ వెన్నుఁడు నున్నగాఁగలుగు వేల్పులతోడ విరించిమౌలమున్
గ్రన్ననఁబోయి " వాసవుని గౌతముఁ డల్గి శపించె, నీసడిన్
గన్ననిశాచరాళి త్రిజగంబుల వ్యాకులపెట్టఁ జొచ్చె, నే
మున్నది యింక, సిగ్గుపడి యొల్లఁడు రాజ్యమతండు" నావుడున్ ౫౮౫

ఆ॥ పద్మజుండు త్ర్యికపద్మాక్షసహితుఁడై యందు చంద్రుఁడున్న గుహకుఁబోయి
రయము గౌతమర్షి రావించి యతనితో నెల్ల రాలకింప నిట్టులనియె. ౫౮౬

క॥ " కామాతురుఁడై యింద్రుఁడు నీమడఁతిం జెఱచుటన్న నింద్యమె, నీత
ప్పేమియు నుండదు తాదృగ్ధమంతులఁబట్టి బిట్టు దిట్టుటలోనన్. ౫౮౭

తే॥ కాని తపసుల కోరుపు కడుఁ బ్రశస్య-మెల్ల త్రైలోక్యరాజ్యంబు నితఁడు మరలఁ
జేయునట్లు ప్రసాదంబు సేయుమయ్యా గౌతమా ! యింక నీ కేమికఅపవలదు.

ఆ॥ ఇచ్చి యండములను నితనికిఁ గ్రమ్మఱ నానసమును రహితయోనిఁ జేసి.
భూతలమున కెపుడుఁ బోవఁదా నభ్యంతరంబుగలుగకుండ రయమ సలుపు" ౫౯

కం॥ అనియిట్లుబోధపఱచిన విని యనిమిషనిష్ఠమైన విశ్వాసముతోఁ
గొనితెచ్చి మేషవృషణము లునిచె నహల్యాపపతికి సుర్వీరమణా! ౬౦

కం॥ అయ్యాడుగులుమీఁదం జయ్యనఁ జెయిపై చుటయును జక్షుస్సులుగా
నయ్యెనవన్నియుఁ బదపడి సెయ్యమునను గౌతముం డనిమిషులతోడన్ ౬౧

శా॥ "వేగంటిం బొనరించి నాఁడ మఘవున్ - వేల్పుల్! వినుం - డెంతయున్
బాగా వీక్షణశోభగల్గి మను నీపై నేతదాస్యంబు - దు
శ్శాఖాండుండయికూడఁ దొంటిదగు పుంస్త్వంబందు లోపంబులే
కీగండెందు స్వరాజ్యమున్ సలుపుఁగానీ యేగతేఁ దుర్వికిన్" ౬౨

—§ ఇంద్రగౌతమసంవాదము. §—

మ॥ అని వాక్రుచ్చుడు నింతలోపలఁ ద్రికోణాకీర్ణమౌ వేల్పురా
యని మోమయ్యె మునీంద్రుసత్తను సహస్రాక్షుండు శోభాయుతం
బుగ-నష్టాంగుడు గౌతమర్షి చరణాంభోజంబులన్ వ్రాలి "రౌ
యాఘా! మత్కృతమునందు నాకగు సపర్యల్పాల దుష్పాపవృత్తముల్. ౬౩

కం॥ వానికి భంగము వాటిలె నేని త్రిలోకేశసంజ్ఞ యెడలెడి-నటులన్
గానటులఁ బ్రసాదింపుము" నా నాతండక్క- టికమునను విన నమరుల్ ౬౪

తే॥ అయిదురాత్రులు భూలోకమందు నీవు భక్తి జరుపంగఁబడుఁ బూజ ప్రజలచేత.
సెంతయుం దృప్తినొందెద వీవుదాన నొక్క-వత్సరమగుదాన నొందినట్లు. ౬౫

సీ॥ ఏదేశమున నానో యీయుత్సవంబుదా నాదేశమునఁ గఱవదుగు వెట్టు.
దేపురి నైదునా ళ్ళిమ్మహోత్సవమగు నాపురిదొర కగు నక్షయంబు
ఏగ్రామజనులెల్ల రీమహంబునుజేతు రాగ్రామజనులకు వ్యాధులుండ
వేపల్లెలోపల నీపండు వగుచుండు నాపల్లియం జింత లాశ్రయింప
వెచటఁ బంచరాత్ర మీక్రమం బలరారు నచటు నావుపాడి కలిసమృద్ధి,
యధికమేల యిట్టులగుచోటు లోకయద్ద మఖిలసుఖములకును నాస్పదములు"

కం॥ అనియిటు వక్కాణించుచు మనమున యోజించిచాల మఖపంతుండి
ట్లను, "నాదుసుత్సవంబున కనఘా! పాత్రత్వమిదితి, వట్లగు నిడలన్. ౬౭

సీ॥ ఏడాకులరఁటుల సెంతయురమ్యమై జాజిపూవాసన ల్పాలఁగలిగి
మంకెనపూలచే మతిమతివ్యాప్తమై కలువలు తామర ల్కరమెసంగి
తుమ్మెద లెల్లెడ ఘుమ్మని కదుమ్రోయఁ బండువెన్నెలల రేల్నిండియుండఁ

బచ్చనిపై రులం బంటవలంతిదా నఖిలసత్త్వములకు హర్షమిడఁగ
నలరునట్టి శరత్కాలమందుమనుజులమ్మరుత్సవమొనరించునట్లుచేయు,
మీఁగతిని బాలవృద్ధుల కెల్లర కది మిగుల నానందదాయకం బగునుగాక" ౧౯౮

క॥ అనివర్ణించుటయును మునినాథుఁడు శ్రవణయుతమున నీకు జనుల్
పొనరించెదరు మహోత్సవ, మొనయుముసంతృప్తి నిర్జరేశ్వర! మఱియున్ ౧౯౯

తే॥ రేవతీయుతమందున నాళధూర్జటి మానభంగంబుఁజేసితి గాన నీదు
కుకృతి ప్రకటీకృతంబుగా వికృతభంగిఁ బతనమయ్యెడునీకుఁ దధ్యంబునందు. ౨౦౦

ఆ॥ దాన మామకీనధవళయశోజ్యోత్స్న యలము మూఁడులోకములను గూడ,
నితరుఁడెవఁడు నిట్టి యేనస్సు గావింప భయమునొందు భంగపడుదుననుచు. ౨౦౧

క॥ శ్రవణాదిపంచతారలు భువిపయి వేర్వేఱ నీదుపూజనమునకున్
సవనసమానములగు వాసవ! తీర్థమయంబులును నసందేహముగన్. ౨౦౨

క॥ ఎవఁడేకోర్కినిగోరుచు భవదర్చనసేయు మఱియుఫలపుష్పములన్
బవిధర! వానికి లబ్ధములవు నవి, కానీ త్వదర్చయ యనర్చ్యయగుటన్. ౨౦౩

శా॥ ఈ వస్మత్ప్రియ బ్రాహ్మణిం జెఱచినా-విప్డెట్టిచెట్లన్ భవం
బౌ విచ్ఛిన్నముయష్టి వేదవిదవన్యాదిత్యవర్యు ల్కఁడున్
శీఘ్రం దావకసర్వమంత్రములచే నిల్వంగలా-రందునీ
ప్రావీణ్యంబునఁ జొచ్చి మానవకృతార్చం గొన్న-సంతృప్తియా. ౨౦౪

క॥ ఎవఁడేవిధి సుస్తంబగు భవదీయంబైన యష్టి బాగుగ లేపున్
భువి వాని కావిధంబున నవు నగ్గలమైనసిద్ధి యస్వప్నపతీ! ౨౦౫

తే॥ పంచరాత్రవ్రతస్థుఁడు బ్రహ్మచర్యమానినట్టిఁడు నగుచు శాస్త్రోదిత ఫల
పుష్పములతోడ నీపూజ పొనరుచునరుఁ డితరపత్నీరతాఘముం జిఱుపఁగలుగు.

శ్లో॥ "నమ శ్శక్రాయ దేవాయ శునాసీరాయ తే నమః
నమస్తే వజ్రహస్తాయ నమస్తే వజ్రపాణయే" ౨౦౬

క॥ అనునీమనువున నెవ్వఁడు నినుఁగూరిచి యర్ఘ్యమిడునో నిష్ఠమెయిని వాఁ
డును నన్యదారసంగమఘునపాపమునుండి తొలఁగుఁ గ్రతుభుగధీశా! ౨౦౭

ఆ॥ ఎవఁడు నీకు నాకు నిపుడైన సంవాద మధికభక్తిఁజదువు నాలకించు
వాఁడు వత్సరంబువఱకాచరించిన వృజిన మంతరించు వేల్పుఱేఁడ!" ౨౦౮

తే॥ అనినవిని తెఱగంటులు హర్షపడుచుఁ జనిరి యమరావతికి శక్రసహితులగుచు-
గౌతముండును గ్రోధసంకలితుఁడగుచుఁ దనదునాశ్రమభూమికిం జనియె నపుడు.

౮ బేలూరి రామన్నగుప్తగారు, సదాశివునిపేట

౯ రాయచూరి బండేరావుగారు, అయినాపురం.

౧౦ రామూరి సుబ్బయ్యగారు - శ్రీ శ్రీ విరూపాక్షసంస్థాన ప్రధానమంత్రి

౧౧ ఘంటంభట్లగారి వెంకటభుజంగముగారు - ముసలాపురం

౧౨ దండు గుండేరావుగారు, కరణము - ముసలాపురం

౧౩ తిగుళ్ళ కృష్ణారెడ్డిగారు. పటేలు - ముసలాపురం

౧౪ కావమాను హనుమయ్యగారు, నర్సారావుపేట

౧౫ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణం, దుగ్గిరాల

౧౬ భాస్కరరాయని వెంకట రామయ్యగారు, వంగపల్లి

౧౭ నరసింహస్వామివారు, యాదగిరి

౧౮ బీరకాయల హనుమంతరావుగారు, రాయగిరి

౧౯ జూలూరి వెంకటరత్నముగారు, వకీలు, గుంటూరు

౨౦ మెదక్ కిషన్‌రావు దేశముఖుగారు, నల్లపల్లి

౨౧ జానపాటి సుబ్రహ్మణ్యంగారు, ప్లీడరుగుమాస్తా, గురిజాల.

౨౨ లింగాల సీతారామరెడ్డి బండారెడ్డి దేశముఖుగార్లు-నారాయణపురం

౨౩ కవులూరి నరసింహారావుగారు, తాలూకా గుమాస్తా-నర్సారావుపేట

౨౪ గోపేటి వేణుగోపాలరావుగారు, పోలీసుసబినస్పెక్టరు, ప్రత్తిపాడు

౨౫ తాచకొండ వెంకటరామయ్యగారు, ఏనమదల

౨౬ కప్పగంతు సుబ్బారావుగారు - పోలీసుసబినస్పెక్టరు - బెల్లంకొండ

౨౭ మండ చినవెంకయ్యగారు, దండమూడి.

౨౮ శ్యామాపంతుల గోపాలరావుగారు - హైదరాబాద్.

౨౯ కన్నయ్యగారిసంగయ్యగారు-ముసలాపురం

౩౦ చక్కిలం పాపయ్యగారు-ముసలాపురం

౩౧ తాళ్లపెలిమె లింగన్న మొకద్దంగారు-గడిపెద్దాపురం

౩౨ కిషన్‌రావు దేశపాండ్యాగారు తాళ్లపల్లి

౩౩ సుబ్బారెడ్డి దేశముఖుగారు, క్షీరసాగరం.

౩౪ చివుకుల శ్రీరామశర్మగారు- నాగులుప్పలపాడు

౩౫ గజవాడ వెంకటాచార్యులుగారు, అల్లాదుర్గము

౩౬ కాకిరాల రామచంద్రయ్యగారు, సముద్రాపురము

౩౭ లక్ష్మీనారాయణగౌడు సెట్టిగారు, అందోలు

౩౮ ఇటికాల రాజేశ్వరరావుగారు - వకీలు కంభంమెట్టు

౩౯ వెలమకన్ని శోభనాద్రిరావుగారు - శోభనాద్రిగూడెం.

౪౦ సారపరాజు వెంకటలక్ష్మీనరసింహారావు దేశముఖుగారు - తమ్మవరం.

౪౧ తిరుమలనల్లాన్ చక్రవర్తి వరదాచార్యుల అయ్యవార్లంగారు - శాతాపురం.

౪౨ కొండంభట్లగారి వెంకన్నగారు. గుమ్మడిదల

# అభినవసరస్వతి

సంపాదకుఁడు - నాగరఖండస్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది, యొకమాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనము లును వ్యాసములును బ్రకటింపఁబడును. చందా సం॥ 1 కి రు 3-0-0

ఈ కార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | కరిణీకోద్ధారిణి [వ్రూరె వీరభద్రకవి] | ... | 0 | 4 | 0 |
| 2 | వాసంతికాపరిణయ నాటకము | ... | 0 | 4 | 0 |
| 3 | కంసవధ నాటకము | ... | 0 | 8 | 0 |
| 4 | చమత్కారమంజరి (సింహాద్రి వెంకటాచార్యులు) | | 0 | 4 | 0 |
| 5 | విరూపాక్షపీఠగురుపరంపర | ... | 0 | 2 | 0 |
| 6 | నీతిగీతులు (సుమతిశతకమునకు సంస్కృతము) | ... | 0 | 2 | 0 |
| 7 | వి[illegible]బ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము | | 0 | 2 | 0 |
| 8 | విగ్రహారాధన ఖండనఖండనము | ... | 0 | 4 | 0 |
| 9 | చిత్తూరుజిల్లాతీర్పు విమర్శనము (పత్రికాధిపతి) | ... | 0 | 4 | 0 |
| 10 | సంగదోషము | ... | 0 | 8 | 0 |
| 11 | అస్పృశ్యతానివారణ ఖండనము(మల్లాది రామకృష్ణచయనులుగారు) | | 0 | 8 | 0 |
| 12 | వత్సలనీతిశతకము | ... | 0 | 1 | 0 |
| 13 | శివానందలహరి (తంగెడ రామకృష్ణకవి) | ... | 0 | 4 | 0 |
| 14 | నర్సారావుపేట శతావధానము (తిరుపతివెంకటీయము) | | 0 | 3 | 0 |
| 15 | పశ్యాంపుశ్యాం | ... | 0 | 2 | 0 |
| 16 | పశ్యశబ్దవిచారము | ... | 0 | 2 | 0 |
| 17 | పురశ్చరణము | ... | 0 | 2 | 0 |
| 18 | శంతనురాజచరిత్ర | ... | 0 | 14 | 0 |
| 19 | వర్ణవ్యవస్థ | ... | 0 | 4 | 0 |
| 20 | స్వర్ణకారవ్యవహారము | ... | 1 | 8 | 0 |
| 21 | శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము | ... | 0 | 10 | 0 |
| 22 | అభినవశాకుంతల నాటకము | ... | 0 | 8 | 0 |
| 23 | సూతసంహిత-ఆంధ్రము | ... | 2 | 0 | 0 |
| 24 | స్కాందమహాపురాణాంతర్గతనాగరఖండము ( ౧ సంపుటము ) | | 1 | 0 | 0 |
| 25 | డిటో నాగరఖండము (౨ సంపుటము) | | 1 | 8 | 0 |
| 26 | భారతీయప్రబోధము (పిశుపాటి చిదంబరశాస్త్రి) | | 0 | 4 | 0 |
| 27 | ధర్మనిర్ణయము. | | 0 | 4 | 0 |
| 28 | భారతకథాతత్త్వనిర్ణయము(మల్లాదిరామకృష్ణవిద్వచ్ఛయనులుగారు) | | 0 | 4 | 0 |

అభినవసరస్వతీకార్యస్థానము, జానపాడు, పిడుగురాళ్ళపోస్టు,
గుంటూరు జిల్లా.